

# 'అసంభవామి యుగే యుగే

-రావి కొండలరావు

మరగకుండానే పొంగుతున్న పాల సముద్రం మీద ఆదిశేషుడు శయనించి వున్నాడు. ఆ శేషుడి పడగ కింద చీకు చింతా లేకుండా కాళ్లు బారజాచుకుని శ్రీ మహావిష్ణువు నిద్రపోతున్నాడు.

ఆయన సతీమణి ఆదిలక్ష్మి కాళ్లు వత్తుతూ దీక్షాతత్పరురాలై కూచుని వుంది. అసలు, మహావిష్ణువు ఎక్కడికీ వెళ్లడు, ఎక్కడా తిరగడు. వెళ్లినా గరుడపక్షి మీద ఆకాశంలో రివ్వున ఎగురుతాడు. లేదా, అక్కడ మాయమై ఇంకో చోట టక్కున ప్రత్యక్షమవుతాడు. మరి, రోజూ క్రోసుల కొద్దీ యోజనాల కొద్దీ తిరిగినట్లు ఆయనకు నిత్యం కాళ్లెందుకు సలుపుతాయో, పీకుతాయో అర్థంకాదని లక్ష్మీదేవి అనుకోక పోయినా, ఆదిశేషుడు అనుకుంటూ వుంటాడు.

పాల సముద్రపు మెత్తని ఘోష తప్ప, ఇంకే శబ్దమూ లేదు. శ్రీ మహావిష్ణువు ఉన్నట్టుండీ ఉలిక్కి పడినట్టుగా దిగ్గున లేచి కూచున్నాడు. లక్ష్మీదేవి కంగారు పడింది. "ప్రాణేశ్వరా! ఏం జరిగింది? కలగన్నారా? లేక ఏ భక్తుడి మొరయినా వినిపించిందా?" అని అడిగింది.

"లేదు. అలాంటి భక్తులు ఇప్పుడెక్కడున్నారు గనుక, ద్వాపరయుగం గుర్తుకొచ్చింది. కృష్ణావతారం గుర్తుకొచ్చింది" అన్నాడు చిరునవ్వుతో శేషశయనుడు.

"ఓహో! ఇన్నేళ్లయిన తర్వాత, మళ్లీ కృష్ణ మూర్తి మెదిలాడంటే, ఏదో ఆలోచన వచ్చిందన్నమాటే. మీకేముండీ - వెంటనే ఆ అవతారం దాల్చి, వేలాది మంది గోపికలు వెంటబడండి" అన్నదామె ఓర కంట చూస్తూ.

"ఏ ఆలోచన అది. నేను కృష్ణావతారంలోనే నరకాసురుడిని చంపాను. అతని మరణాన్ని శ్లాఘిస్తూ ప్రజలంతా దీపావళి పేరిట ఘనంగా వేడుకలు చేస్తారు. ఈ రోజే దీపావళి. అందుకనే ఆ అవతారం గుర్తొచ్చింది"

"అవును - సత్యభామట గదా, ఆ రాక్షసుణ్ణి వధించింది!"

"కొందరు అలా అంటారు. కొందరు నేనే నంటారు. ఎవరైనా ఏమైనా, చేయించిన వాడిని నేనే గదా"

"చంపింది సత్యభామ అయి వుంటుంది లెండి. ఆ ఘనత స్త్రీకి ఇవ్వడం ఇష్టం లేక, మీదేనని చాటు

కుంటున్నారు"

"పోనీ, సత్యభామనే అడుగు - ఏం చెబుతుందో" అని మహా విష్ణువు ఆమెను పిలిచాడు. శూన్యం లోంచి సత్యభామ రూపం పోసుకుని దిగి వచ్చింది. మహావిష్ణువు శ్రీకృష్ణరూపంలో కనిపించాడు "స్వామీ" అందామె ఆనందంగా.

"మరేం లేదు సత్యా - ఆ నాడు నరకుడిని చంపింది నువ్వా నేనా అని అనుమానం వచ్చింది. అందుకని పిలిచాను"

"ఇద్దరమూ కలిసే వధించాము స్వామీ. మీరు అలిసి పోయినప్పుడు నేనూ, నేను అలసినప్పుడు మీరూ బాణాలు వేశాము. ఏమైనా కారకులు మీరేగా స్వామీ! అందుకేగదా, దీపావళి నాటి పూజలన్నీ మీకే అందుతున్నాయి. నా పేరెవరు చెప్పు కుంటున్నారు? నన్నెవరూ పూజిస్తున్నారు? ఇంకా చెప్పాలంటే లక్ష్మీదేవిని పూజిస్తున్నారు"

మహావిష్ణువు నవ్వాడు. "కథ చెప్పుకునేటప్పుడు నిన్ను తలచుకుంటూ నీ గురించే గదా చెప్పు కుంటారు!" అన్నాడు.

"పోనీలెండి. ప్రఖ్యాతి మీకొస్తే ఏమిటి - మీ భార్యనైన నాకొస్తే ఏమిటి! సరే, స్వామీ! ఎలాగూ నన్ను పిలిచారుగనుక, ఒక్క కోరిక కోరతాను."

సత్యాపతి సందేహంగా చూశాడు.

"మరేం లేదు స్వామీ! నరకాసుర వధ ఆ యుగంలో జరిగినా, జరిగి ఇన్నేళ్లయి, యుగం మారినా ప్రజలు ఇంకా ఆ వేడుకలు, సంబరాలు చేస్తూనే వున్నారట. అని ఎలా చేస్తున్నారో, ఎలా కృతజ్ఞతలు తెల్పుకుంటున్నారో, ఒక్కసారి భూ లోకం వెళ్ళి చూడాలని వుంది. దయచేసి తీసు కెళ్లరూ" అని ప్రాధేయపడింది సత్యభామ.

ఆయన చిరునవ్వు నవ్వి "ఇప్పుడు నువ్వు భూలోకం చూడలేవు సత్యా. అప్పుడు మనకి ఒక్కడే నరకాసురుడు. ఇవాళ అక్కడే ఎందరో నరాసురులూ, నరకాసురులూ వున్నారు" అన్నాడు.

"అలాగా! ఐతే తప్పకుండా చూడాలి. ఇవాళే దీపావళి గదా, తీసుకెళ్లండి."

"అలాగే, "నీ ఇష్టం" అన్నాడు మహా విష్ణువు. మహాలక్ష్మిని కూడా రమ్మన్నాడు. ఆమె రానంది. తాను ఆ ఘోరాలు చూడలేనని, పైగా వైకుంఠం వదిలి రాలేనని కచ్చితంగా చెప్పేసింది.

"అవున్లే, నువ్వు భూలోకం వస్తే అక్కడ పేరుకుపోయిన పేదరికం నమసిపోదూ!" అన్నాడు వ్యంగ్యంగా కృష్ణుడు, సత్యభామతో బయల్దేరుతూ. గరుత్మంతుడు రివ్వున వచ్చి వాలాడు. ఇద్దరూ గరుడ వాహనం మీద భూలోకం చేరుకుని, అదృశ్యంగా పైన విహరించ సాగారు.

సత్యభామకి భూలోకం అంతా వింతగా కని పించ సాగింది. వాహనాలు, మహాజనం, పెద్ద పెద్ద భవనాలు, మేడలు చూస్తూ ఆమె విస్తుపోయింది. గరుడ వాహనం ఇంకాస్త కిందికి దిగడంతో, ఒక విశాలమైన మహాపట్నం మధ్యలో "యుద్ధం" లాంటిది కనిపించింది.

"స్వామీ! అదేమిటి స్వామీ - దీపావళి పండగ పూట చక్కగా సంబరం చూడొచ్చునుకుంటే వాళ్లంతా అలా పోట్లాడుకుంటున్నారేమిటి?" అని అడిగింది అయోమయంగా

"ఒకరు దీపావళి పండుగ చేసుకుంటూ మహా లక్ష్మీదేవిని ఊరేగిస్తూ వుంటే, ఇంకో వర్గం వారు అడ్డుపడ్డారు. రెండు వర్గాలూ ఘర్షణలోకి దిగి, చావగొట్టుకుంటున్నారు"

"అయ్యయ్యో - మధ్యలో వాళ్లెవరో పేలుస్తున్నారే"

"వాళ్లని పోలీసులంటారు. రెండు వర్గాలూ అదుపు తప్పి పోవడంతో, వాళ్ళు తుపాకులు పెట్టి కాలుస్తున్నారు"

"అయ్యయ్యో - ఎందరు మనుషులు చచ్చి



పోతున్నారే - ఆ భవనాలూ, వాహనాలూ అవీ ధ్వంసం అయి పోతున్నాయే" అని సత్యభామ బాధ పడింది.

"ఇంకా అటు చూడు" అని కృష్ణుడు, మరి కొన్ని పోట్లాటలూ, గృహ దహనాలూ హత్యలూ చూపించాడు.

"స్వామీ! నాకు భయంగా వుంది. ఇన్ని ఘోరాలు, ఇంతటి దారుణం జరుగుతూ వుంటే, దీపావళి వేడుకలు జరక్కపోతే యేం"

"పండుగలు, వేడుకలూ వస్తే ఒక వర్గం చేసుకోగా ఇంకో వర్గం ఊరుకోదు. ఇవన్నీ పండుగ రోజుల్లో మామూలే. ఈ మంటలు దీపావళి కాంతులు కావు. ఆ ఘోష సంరంభం కాదు - ఆ వాహనాలూ ఇళ్లూ అన్నీ వాళ్లవే. వాళ్ల ప్రభుత్వ ఆస్తుల్ని వాళ్లే ధ్వంసం చేసుకుంటున్నారు"

"ఎంత అన్యాయం! దేవతల్ని మించిన తెలివి తేటలు గల మానవులు ఇంత అజ్ఞానంలో పడి కొట్టుకుంటున్నారా - ఆశ్చర్యంగా వుంది"

గరుడపక్షి వాళ్లని ఇంకో వేపు తీసుకెళ్లింది.

"స్వామీ - ఇక్కడ వీళ్లంతా ఇన్ని వరసలుగా నించున్నారేమిటి?"

"వాటిని క్యూలంటారు. అక్కడఅలాదారుణం జరిగిపోతూనే వుందా - ఇక్కడ వీళ్ల వినోదం కోసం ఎగబడుతున్నారు. సినిమాలనీ, సర్కస్‌లనీ వుంటాయి. అవి చూడ్డానికని, ఆ టిక్కెట్ల కోసం ఇలా క్యూల్లో నించుంటారు. ఆ క్యూ చూశావా - అది ఇలాంటిది కాదు. అది పాలకోసం. పాలు కొనుక్కోడానికి, అలా అంతమంది నించుని వున్నారన్న మాట"

"పాలకోసం కూడా రద్దీయా?". "పాలంటా వేమిటి - ఇలా చూడు. ఇంకా పెద్ద క్యూ ఇది. ఇది నీళ్ల కోసం. బిందెలు, చెంబులూ, గంగాళాలు పట్టుకుని ఎందరు స్త్రీలు నించున్నారో చూశావా - నీళ్ల కోసం! తాగడానికి నీళ్ల కోసం"

"నీరు కూడా దొరకదా స్వామి భూలోకంలో? ఇన్ని నదులూ చెరువులూ సరస్సులూ వుండగా నీరు దొరక్కపోవడం ఏమిటి?"

"నీరుంది. నదులు పొంగుతూనే వున్నాయి. కానీ అవన్నీ ప్రభుత్వం వారి రాజకీయపు సుడుల్లో చిక్కుకున్నాయి. కావలసిన వాళ్లకి అందవు"

"లేచిన దగ్గర్నుంచి ప్రతి దానికీ ఇలా వరసల్లో జనం నించుంటే, తక్కిన పని పాట్లన్నీ ఎలా చేసుకుంటారు?"

"అసలు ఈ క్యూలు అన్నవి ఇంకా వున్నాయి. ఇంకా ఎన్నో విచిత్రాలు చూపిస్తాను చూడు. ఈ పండగ నాటికి కొన్ని రోజులు ముందుకి వెళదాం. జరిగిన ఘోరాలూ నేరాలూ చూద్దువుగాని"

దీపావళికి ముందు జరిగి పోయిన కొన్ని ఘట్టాల్ని, దృశ్యాల్ని చూపించసాగాడు శ్రీకృష్ణుడు.

"ఆ కేకలు, ఆ జనం, ఉరుకులు, పరుగులూ ఏమిటి స్వామీ?"


"ఊరేగింపులు. ఉద్యోగులు జీతాలు చాలదని ఊరేగింపు చేస్తున్నారు. ఆ ఊరేగింపులు చూశారూ - ఒక దాన్నొకటి కౌరవ పాండవ సైన్యాల్లాగా ఎదుర్కొంటున్నాయి!"

"అవును! చూడ్డానికి భయంకరంగా వుంది"

"కొంత మందికి ఉద్యోగాలు ఎక్కువ చేస్తానంది ప్రభుత్వం. మరి కొంత మంది అన్యాయం, అక్రమం అనీ కూడదంటున్నారు. కూడదన్నవాళ్లు కూడును అన్న వాళ్లు ఊరేగింపులు చేస్తూ ఒకర్నొకరు చంపుకుంటున్నారు. మధ్యలో ప్రభుత్వపు దేశరక్షకులు కాల్పులు చేస్తున్నారు. దుకాణాలు, వాహనాలు, భవనాలూ ధ్వంసం అయి పోతున్నాయి. అరాచకం చూశావా ఎలా ప్రబలి పోతుందో!"

"చాలా అన్యాయంగా వుందే"

"ఆ ఊరేగింపు, జనం చూశావా - దాన్ని సమ్మె అంటారు. చదువుకుంటున్న విద్యార్థుల్లో ఒక విద్యార్థి పరీక్షల్లో దొంగతనంగా సమాధానం తెచ్చి రాస్తూ పట్టుబడ్డాడు. అధికారులూ అతను పరీక్ష రాయడానికి కుదరదని పొమ్మన్నారు. అలా పొమ్మనడం నేరం అని తక్కిన విద్యార్థులంతా కళాశాలలకీ, పాఠశాలలకీ వెళ్లకుండా, వెళ్లనీయకుండా సమ్మె చేస్తున్నారు. ఆ సమ్మె జీతాలు పెంచమని కార్మికులు చేస్తున్న సమ్మె. ఈ సమ్మె నిజాయితీ పరుడైన తమ అధికారిని పదవి నుంచి తీసేయమని సమ్మె. ఇలాంటివే ఇవన్నీ సమ్మెలు.ఇంకా బంద్‌లనీ, ఘెరావ్‌లనీ ఏవేవో పేర్లున్నాయి. ఆ గొడవ చూశారా - రాముడి జన్మభూమి అదేనని కొందరు, అది కాదని మాదని ఇంకొందరూ ఊరేగింపులుగా వెళ్లి అల్లర్లు చేస్తున్నారు. అది చూడు సాధువుల




సమాజం. వాళ్లకేవో కోర్కెలు. ఊరేగింపు చేస్తున్నరా - సాధువులైవుండీ దహనకాండ, హింసాత్మక చర్యలూ చేపట్టారు చూడు..."

"వాతావరణం అంతా భయంకరంగా, అశాంతి అలజడులతో వుంది స్వామీ! ఎక్కడా శాంతి, క్షేమం వున్నట్టులేదే."

"ప్రతి రాష్ట్రం లోనూ గొడవలున్నాయి. హత్యలు, దోపిడీలు, మానభంగాలు, దౌర్జన్యం, దారుణం, దహనకాండ... ఇలా ఎన్నో... చూసావా సత్యా!

సత్యభామ కళ్లు మూసుకుంది.

"చాలు స్వామీ చాలు. దీపావళి వేడుకలు, సంబరాలు, పూజలు చూపించమంటే, ఇవన్నీ చూపిస్తున్నారు. చాలు! నేనింక చూడలేను. ఈ అక్రమాలు దౌర్జన్యాలు, రాక్షసత్వం నరకుడి చేష్టల్ని మించిపోయి వున్నాయి. అవునూ... దుష్ట శిక్షణ చేసి, శిష్ట రక్షణ చెయ్యడానికి, పాపం పెచ్చు పెరిగితే హరించడానికి ప్రతి యుగంలోనూ, ధర్మ సంస్థాపన చెయ్యడానికి అవతరిస్తానని చెప్పారే - ఈ అధర్మం చాలదా - మీరు అవతరించి, ఈ అన్యాయాన్ని అంతరింపజేసి, ధర్మాన్ని నెలకొల్పడానికి ఇది తరుణం కాదా - ఇంకా ఆలస్యం చేస్తున్నారేం ప్రభూ!"

శ్రీకృష్ణుడు చిరునవ్వు నవ్వాడు.

"సత్యా! ఇది కలియుగం. ఈ యుగంలో నేను అవతరించి చేసేదేం లేదు. పాపం పెరిగి పోతోంది. నీతీ, నిజాయితీ మచ్చుకి కూడా లేవు. నేను అవతరించి, ఎవర్ని ఉద్ధరించాలి? ఎక్కడైనా సన్మార్గులుంటే, వాళ్లు అతీతులుగానే వుంటారు. ఇదంతా ఈమానవులుచేజేతులాచేసుకుంటున్నారు. స్వార్థం పెరిగిపోడంతో అర్థం చేసుకోగల శక్తి సన్నగిల్లింది. ధర్మం పూర్తిగా నశించి పోతోంది. ఈ మానవులంతా వాళ్లలో వాళ్లే ఇలా ప్రతి దానికీ పోట్లాడుకుంటూ, అమాయకుల్ని బాధలు పెడుతూ, ఒకర్నొకరు కొట్టుకునీ, తన్నుకునీ, పొడుచుకునీ చస్తారు. ధర్మాన్ని నాశనం చేసిన వాళ్లే, మంచితనాన్నీ హరింపజేస్తారు. పాపం పండుతోంది. ప్రజానాశనం దానంతటదే జరుగుతుంది. ఇక నేను అవతారం ఎత్తి శిష్ట రక్షణ చెయ్యడానికి శిష్టులు లేరు, దుష్ట శిక్షణ దానికదే జరుగుతోంది. చూశారా - దీపావళి"

"అంతా పాపావళి! నేనింక చూడలేను. తిరిగి పోదాం పదండి. మనమైనా ప్రశాంతంగా వుందాం" అంది సత్యభామ విచారవదనంతో. గరుత్మంతుడు రివ్వున ఊర్ధ్వ లోకాలను ఎగిరాడు. కృష్ణ సత్యభామలు మళ్లీ భూమి వేపు తిరిగి చూడకుండా పై పైకి పారిపోయారు.

భూమ్మీద హాహాకారాలు, దమన కాండ విజృంభిస్తూనే వున్నాయి...